నులిపురుగుల నివారణే లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, జూన్ 20: నులిపురుగు నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. గురువారం ప్రజ్ఞాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా మాత్రలను తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌలి గుప్తా, జడ్పీటీసీ మల్లేశం, వైద్యులు బల్బీర్‌సింగ్, కాశీం, సీహెచ్‌వో అనిత, ఏఎన్ఎం సుజాత, హెచ్ఎం కృష్ణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శారీరక ఎదుగుదలపై ప్రభావం

హుస్నాబాద్‌టౌన్, జూన్ 20 : నులిపురుగులతో పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగదల లోపిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఆరు నెలలకోసారి నులిపురుగుల నివారణ మందులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపవైద్యాధికారి ప్రభాకర్, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, వైద్యురాలు నిఖిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం వాసుదేవరెడ్డితోపాటు సిబ్బంది ఉన్నారు.

మాత్రలు తప్పనిసరి

మిరుదొడ్డి జూన్ 20 : నులిపురుగుల నివారణకు తప్పనిసరిగా మాత్రలు వేయాలని ఎంపీపీ సాయిలు, డాక్టర్ సమీనా సుల్తానా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజులు, తహసీల్దార్ గోవర్ధన్, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి స్వర్ణలత సీహెచ్ లింగమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు

వర్గల్‌లో..

వర్గల్, జూన్ 20 : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ సజావుగా కొనసాగింది. వర్గల్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన మాత్రల పంపిణీలో మండల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌గౌడ్, వర్గల్ జడ్పీటీసీ బాలమల్లుయాద వ్, వైద్యురాలు హరిత విద్యార్థులకు మాత్రలు వేశారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, జూన్ 20: విద్యార్థులందరూ నులి పురుగుల నివారణకు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు అన్నా రు. గురువారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పట్టణ 23, 24 వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, ఏఎన్ఎం శ్రీవాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులో..

నంగునూరు, జూన్ 20 : మండల పరిధిలోని గట్లమల్యాలలో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారి అంజలిరెడ్డి విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ యాదవరెడ్డి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు తప్పనిసరిగా మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్ జూన్ 20 : చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ బాలేశం గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాల, అలిరాజ్‌పేట సేయింట్‌విన్సెంట్ పాఠశాలలో చిన్నారులకు ఎంపీడీవో యాదగిరి, జగదేవ్‌పూర్, తీగుల్ వైద్యులు సత్యప్రకాశ్, రాజగౌడ్‌లతో కలసి ఆయన మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసవర్మ, జగదేవ్‌పూర్ సీహెచ్‌వో శ్రీమతి, హెల్త్‌అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక, జూన్ 20 : నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి సూచించారు. గురువారం దుబ్బాక కస్తూర్బా పాఠశాల, రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

చిన్నకోడూరులో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ

విద్యార్థులు క్రమ శిక్షణతో చదవాలి

చిన్నకోడూరు, జూన్ 20 : విద్యార్థులు క్రమ శిక్షణతో చదవి ఊరికి మంచి పేరు తేవాలని జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. మండల కేంద్రంలోని చిన్నకోడూరు ఉన్నత పాఠశాల, అల్లీపూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు గురువారం నులి పురుగుల మాత్రలు జడ్పీ చైర్ పర్సన్ వేశారు. అలాగే విద్యార్థులకు నోట్ బుక్స్‌తోపాటు దుస్తులు అందజేసి మధ్యాహ్న జోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ 19 ఏండ్లలోపు విద్యార్థులు తప్పకుండా నులి పురుగుల మాత్రలు వేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, ఎంఈవో యాదవ రెడ్డి, సీనియర్ నాయకుడు రామచంద్రం, మాజీ సర్పంచ్ ఉమేష్‌చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి

కొండపాక (కుకునూరుపల్లి), జూన్ 20 : 1 నుంచి 19 ఏండ్ల వయస్సున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేయించాలని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. గురువారం జాతీయ నూలిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా కొండపాక మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ట శ్రీనివాస్‌తో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నులి పురుగుల నివారణకు ఈ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయరాణి, ఉప వైద్యాధికారులు డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ శ్రీనివాస్, వినోద్ బాబ్జీ, ఎంపీపీ అనసూయ కనకరాములు, ఎంపీడీవో వెంకటేశం, కొండపాక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్, ఉపాధ్యాయులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేట : చిన్నారులకు నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

హుస్నాబాద్‌టౌన్: మాత్రలు వేస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

తొగుట : బండారుపల్లి లో అంగన్‌వాడీ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది

25న స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు సెలక్షన్లు

చేర్యాల, జూన్ 20 : మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్లు ఈ నెల 25న ఉదయం 9 గంటలకు మండల విద్యా శాఖాధికార్యాలయం వద్ద నిర్వహిస్తున్నామని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం వచ్చే విద్యార్థులు 2015 సెప్టెంబర్ ఒకటి నసుంచి 2016 ఆగస్టు 31మధ్య జన్మించి ఉండాలన్నారు. 9 రకాల అంశాలపై టెస్టు ఉంటుందని, అన్ని రకాల ఈవెంట్లలో ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను ఈ నెల 29న జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 949 48763 76 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

20వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళిగుప్తా

గజ్వేల్, జూన్ 20 : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో గురువారం మున్సిపల్ చైర్మన్ రాజమౌలి గుప్తా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వీధికి సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి గజ్వేల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నర్సయ్య, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

చేర్యాల, జూన్ 20 : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని చేర్యాల సీఐ శీను, ఎస్సై దామోదర్ సూచించారు. కడవేర్గు సమీపంలో బుధవారం రాత్రి ఆటో, కారు ఢీకొన్న ఘటనలో 15 మంది గాయపడడంతో ఆటో డ్రైవర్లతో గురువారం వారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోహెడ, జూన్ 20 : మండల పరిధిలోని బస్వాపూర్‌కు చెందిన వివాహిత బొల్లం రూప (24) బుధవారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భార్యభర్తల మధ్య వచ్చిన చిన్న తగాదాతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన రూపకు బస్వాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌తో వివాహమై రెండేండ్లు కావస్తున్నది. వీరికి ఓ పాప ఉంది. ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జియోగ్రాఫికల్ సమాచార వ్యవస్థపై శిక్షణ

మాట్లాడుతున్న ఎస్ఈ మోహన్ రెడ్డి

సిద్దిపేట, జూన్ 20 : స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ ఇంజినీర్లకు జియోగ్రాఫికల్ సమాచార వ్యవస్థపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేల ఎస్ఈ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో ఎక్కడా అంతరాయం జరిగిందో యాప్ ద్వారా తెలుసుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతో తోడ్పడుతుందన్నారు. ముందుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ సర్వే చేపట్టామని తెలిపారు. ఇక్కడ విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తా అన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎస్ఈ జానకిరామ్, సిద్దిపేట డీఈ మహేశ్‌కుమార్‌తో పాటు పలువురు ఇంజినీర్లు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఐనాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి

కొమురవెల్లి, జూన్ 20 : ప్రజలను ఇబ్బంది పెడుతున్న విద్యుత్ సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఐనాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు చెరుకు రమణారెడ్డి డిమాండ్ చేశాడు. గురువారం మండలంలోని ఐనాపూర్‌లో రైతులతో కలిసి మాట్లాడుతూ.. ఐనాపూర్, తపాస్‌పల్లి గ్రామాల్లో రైతులు, ప్రజలను జూనియర్ లైన్‌మెన్ రమేశ్, కట్టర్ నర్సింహులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వీరు వీధులకు హాజరు కాకుండా ప్రైవేటు వ్యక్తుల తోటి పనులు చేపిస్తూ రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా విద్యుత్ అధికారులు స్పందించి వీరిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, శ్రీనాథ్‌రెడ్డి, రాజు, రమేశ్, వెంకటేశ్, అమ్యుత్‌రెడ్డి, ఉదయ్, శాదుల్ తదితరులు పాల్గొన్నారు.

ఐనాపూర్‌ను సందర్శించిన ఏడీ

ఐనాపూర్‌లో విద్యుత్ సిబ్బంది ప్రజలను ఇబ్బంది పెడుతున్నరని మాజీ సర్పంచ్ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏడీ రత్నాకర్‌చారి ఐనాపూర్ సందర్శించారు. బాధిత రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ లైన్‌మెన్ రమేశ్, కట్టర్ నర్సింహులుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరడంతో ఏడీ సానుకూలంగా స్పందించారు.

ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, జూన్ 20 : చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ సర్కార్ వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు సామల్ల సాయి ప్రేమ్, గుడి కందుల నరేశ్, బుక్య భిక్ష పతిలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయం లో ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పదో తరగతి పాసైన విద్యార్థులకు రూ.10వేలు వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సందులాపురం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొ న్నారు

నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి

హుస్నాబాద్, జూన్ 20 : నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, సీనియర్ నాయకుడు సుధాకర్, నియోజకవర్గ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు నిరసన

బంధువులతో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు

దుబ్బాక, జూన్ 20 : నియోజకవర్గంలోని రామేశ్వరంపల్లిలో ప్రియుడి ఇంటి ఎదుట బాధిత మహిళ చేపట్టిన పోరాటానికి పోలీసు అధికారులు స్పందించారు. గత మూడు రోజులుగా ఆమె బంధువులతో కలిసి ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే. ప్రేమించిన ప్రియుడు పెండ్లికి నిరాకరించడంతో... న్యాయ పోరాటానికి దిగింది. ఇందుకు ఆ బాధిత మహిళకు గ్రామస్తులు, మహిళా సంఘాల అండగా నిలిచారు. ఈ విషయమై గురువారం సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్‌లతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత మహిళ కవితతో ఏసీపీ మాట్లాడి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కవిత ప్రియుడైన శ్రీకాంత్, అతడి తల్లిదండ్రులతో ఏసీపీ మధు ఫోన్‌లో మాట్లాడారు. ఇరువురిని సిద్దిపేట ఏసీపీ కార్యాలయానికి వస్తే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వగా, కవిత తన బంధువులతో కలిసి గురువారం సాయంత్రం ఏసీపీ కార్యాలయానికి వెళ్లారు. ఇదిలా ఉండగా శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాయి మింగి చిన్నారి మృతి

చేర్యాల, జూన్ 20 : మండల పరిధిలోని కడవేర్గు గ్రామానికి చెందిన ఓ చిన్నారి రాయిని మింగడంతో మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. డ్రైవర్‌గా విధులు నిర్వహించే షబ్బీర్ జరీనాబేగం రెండో కుమార్తె అలీషా(18నెలలు) కొమురవెల్లి మండలంలోని రాంసాగర్‌లో అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఇంటి ముందు అలీషా చిన్నపిల్లలతో అడుకుంటూ చిన్న రాయి మింగింది. దీంతో అలీషా అక్కడిక్కడే రక్తం కక్కుకోవడంతో కుటుంబ సభ్యులు కడవేర్గులో వైద్యులకు చూపించారు. అప్పటికి రాయి బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు చేర్యాలలోని ప్రైవేటు దవాఖానకు తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్య సేవల కోసం సిద్దిపేట దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి

దుబ్బాక, జూన్ 20 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వని తాభూంరెడ్డి తెలిపారు. గురువారం దుబ్బాక పట్టణంలోని 18వ వార్డు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో గుణాత్మక విద్యతో పాటు సకల వసతులుంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సక్కుబాయి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల గుర్తింపును రద్దుచేయాలి

హుస్నాబాద్, జూన్ 20 : అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు తదితర సామాగ్రిని విక్రయిస్తున్న పాఠశాలలపై ఆకస్మిక దాడులు చేసి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారం చేస్తూ పుస్తకాల వ్యాపారమే ధ్యేయంగా పని చేస్తున్న హుస్నాబాద్‌లోని పలు పాఠశాలలను వారు గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలలు ఏర్పాటు చేసుకున్న పుస్తకాల గదులు, గోదాంలను సందర్శించి పుస్తకాల విక్రయాలు జరుగుతున్నాయని ఎంఈవోకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఎంఈవో రెండు పాఠశాలలకు చెందిన గోదాంలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి శివరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు యూనిఫామ్ నుంచి మొదలుపెడితే పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, విద్యార్థులకు అవసరమయ్యే ప్రతి వస్తువును పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు, గోదాంలు పెట్టి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఒకటో తరగతి పుస్తకాలను రూ.3వేలకు అమ్ముతున్నారని, అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల గుర్తింపును రద్దు చేయనపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజునాయక్, రవీందర్, సంపత్, అరవింద్‌ఠాకూర్, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో దగ్ధం

చేర్యాల, జూన్ 20 : పట్టణంలోని పెద్ద మ్మగడ్డకు చెందిన ఒగ్గ శ్రీశైలం అనే వ్యక్తికి చెందిన ఆటో దగ్ధమైంది. ఆటో నడుపుకొని జీవనం సాగించే శ్రీశైలం జనగామకు వెళ్లి వచ్చి ఆటోను రాత్రి ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లో నిద్రించాడు. బుధవారం అర్ధ రాత్రి దాటిన అనంతరం ఒక్కసారిగా ఆటోలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు శ్రీశైలంను నిద్రలేపడంతో బాధితుడు పరిసరాల్లో ఉన్న నీటిని తీసుకొచ్చి మంటలను ఆర్పాడు. ఆటో అగ్నికి ఆహుతి కావడంతో శ్రీశైలం ఆర్థికంగా నష్టపోయాడు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బాలవికాస ఆధ్వర్యంలో ర్యాలీ

బెజ్జంకి, జూన్ 20 : మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో వితంతవు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అన్న మేరి, సుజాత, మహిళలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

సిద్దిపేట టౌన్, జూన్ 20 : అత్యవసర సమయంలో రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగామ్ మేనేజర్ జనార్దన్ సూచించారు. సిద్దిపేట జిల్లాలో 108, 102 అంబులెన్స్ వాహనాలను గురువారం ఆయన ఆక్మసికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పైలెట్స్‌తో పాటు ఈఎంటీలకు నలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మేనేజర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

భార్యే కడతేర్చింది

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి హత్య

హుస్నాబాద్, జూన్ 20 : మండల పరిధిలోని కూచనపల్లిలో జరిగిన గీకురు నర్సయ్య (55) హత్య కేసును పోలీసులు ఛేదించారు. నర్సయ్య భార్యతో పాటు ఆమె ప్రియుడు కలిసి నర్సయ్యను గొడ్డలితో నరికి చంపారని విచారణలో తేలింది. గురువారం సీఐ శ్రీనివాస్ విలేకరులకు తెలిపిన వివరాలు.. సోమవారం అర్ధరాత్రి సమయంలో నర్సయ్యను గొడ్డలితో నరికి చంపిన ఘటనపై ప్రత్యేక విచారణ చేపట్టారు. ఘటన జరిగిన ప్పటి నుంచి మృతుడి భార్య గీకురు ఎల్లవ్వపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎల్లవ్వ అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరిలో ఉన్న లింగారెడ్డికాలనీకి చెందిన మహ్మద్ రంజాన్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా భర్త నర్సయ్య పలుమార్లు మందలించాడు. అయినా భార్య ప్రవర్తనలో మార్పురాలేదు. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్న నర్సయ్యను అడ్డు తొలగించుకోవాలని నిర్ణ యించుకున్నారు. ఈ నెల 18న రాత్రి ఇంటి ముందు నిద్రిస్తున్న నర్సయ్యపై పథకం ప్రకా రం గొడ్డలితో చంపేశారు. అనంతరం ఎల్లవ్వను విచారించగా తన ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు ఒప్పుకుంది. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకొని నిందితులు గీకురు ఎల్లవ్వ, మహమ్మద్ రంజాన్‌లను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై తోట మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేట టౌన్, జూన్ 20 : షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని సిద్దిపేట జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ స్టడీ సర్కిల్లో రెసిడెన్షియల్స్‌తో కూడిన ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జూలై 10వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.3లక్ష లోపు ఆదాయ ధ్రువ పత్రాలను కలిగి ఉండాలన్నారు. శిక్షణ అభ్యర్థులకు జూలై 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాజిరెడ్డి

రాజిరెడ్డి

సిద్దిపేట టౌన్, జూన్ 20 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సిద్దిపేటకు చెందిన కూతురు రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల19, 20 తేదీల్లో ఖమ్మం పట్టణంలో జరిగిన ఐజేయూ తృతీయ మహాసభలలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాజిరెడ్డి ఎంపిక కావడంతో సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలకుంట్ల రంగాచారి, పైడిపల్లి అరుణ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అజయ్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

గురుమన్నగుట్ట భూములను ఆక్రమిస్తే చర్యలు

వర్గల్, జూన్ 20 : మండల పరిధిలోని వేలూర్ గ్రామపరిధిలో ఉన్న సర్వే నంబర్ 337లో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాల్‌రాజ్ హెచ్చరించారు. ఈ సర్వే నంబర్‌లో భూమిలేని పేదలకు పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు చర్యలు తీసుకొంటామన్నారు.

హామీలను అమలు చేయాలి

సిద్దిపేట, జూన్ 20 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.10వేలు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్వీ పట్ట మాజీ అధ్యక్షుడు పెక్కబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు విద్యాజ్యోతుల పథకం అమలు చేయకపోవడం విద్